క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: గేదెలు అడ్డురావడంతో మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం కోటమిట్టకు చెందిన కరిముల్లా పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు బయలుదేరగా కసుమూరు సమీపంలో గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో కరిముల్లాకు గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్రశర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

గురుకులంలో పేరెంట్స్ సండే

ముత్తుకూరు: ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం పేరెంట్స్ సండే జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. చాలాసేపు నిరీక్షించిన తర్వాత మధ్యాహ్నం వీరిని లోపలికి అనుమతించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో దుకాణాలు కిక్కిరిసిపోయాయి.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్యవర్గం

పొదలకూరు: ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లుగా సర్వేపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు దువ్వూరు పాండు ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా రషీద్, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్‌వలీ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆర్.కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాల కోసం తమ ఫోరం పనిచేస్తుందన్నారు. సభ్యులుగా 25 మందిని నియమించినట్లు తెలిపారు.

పుచ్చ సాగుపై రైతుల ఆసక్తి

- పెరిగిన విస్తీర్ణం



సాగులో ఉన్న పుచ్చ పంట

పొదలకూరు: మండలంలో పుచ్చ సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతున్నట్టు ఉద్యానాధికారులు వెల్లడిస్తున్నారు. ఒక కిలో పుచ్చ విత్తనాలపై రైతులు రూ.5 వేలు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే మొగళ్లూరు, కనుపర్తి, అల్లూర్తి, ఆర్ వైపాళెం, అంకుపల్లి, ఊసపల్లి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఒక్క మొగళ్లూరు గ్రామంలోనే సుమారు వందెకరాల్లో సాగు జరుగుతోంది. మల్చింగ్(పాలిథిన్ కవర్లు) పద్ధతిని పాటించడం వల్ల గడ్డి సమస్య లేకుండా రైతులు జాగ్రత్త పడుతున్నారు. ఈ పద్ధతిలో సాగు చేయని రైతులు గడ్డి పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విజయలక్ష్మికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాకాణి

కోవూరు: కోవూరు మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సతీమణి విజయలక్ష్మి మరణించారు. ఈ క్రమంలో ఆమె పార్థీవదేహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామచంద్రాపురంలో ఉచిత వైద్యశిబిరాన్ని మెడికల్, ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు తిరుపతిరెడ్డి మాట్లాడారు. పేదలకు ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. పల్లవి ఐ క్లినిక్ లలిత్ కుమార్, సామాజికవేత్త గండికోట సుధీర్‌కుమార్, కరిష్మా, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు





నజీర్‌తోట, సాయిబాబా మందిర సమీపంలోని ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన మొక్కలు

- చెట్లు ఏపుగా పెరిగినా పట్టించుకోని యజమానులు
- చర్యలు చేపట్టని శానిటేషన్ అధికారులు
- విజృంభిస్తున్న దోమలు, విషసర్పాలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనేక ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రత నెలకొంది. దీంతో దోమలు, విషసర్పాల బెడద అధికంగా ఉంది. పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆయా స్థలాల యజమానులు పట్టించుకోవడం లేదు. చర్యలు చేపట్టాల్సిన కార్పొరేషన్ యంత్రాంగం మౌనంగా వహిస్తోంది. దీంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు పెడచెవిన

నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేయాలి. ప్రాంగణాలను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలి. ఖాళీ స్థలాలను శుభ్రపర్చి మట్టిని సమాంతరంగా చదును చేసి పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకురావాలి. పారిశుధ్య పనుల పర్యవేక్షణ సమయంలో ఈ మాటలను కమిషనర్ సూర్యతేజ నిత్యం చెప్తుంటారు. అయితే ప్రజల్లో గానీ శానిటేషన్ అధికారులు, సిబ్బందిలో ఎలాంటి మార్పు రావడం లేదు.

నెల్లూరులో ఇలా..

కార్పొరేషన్ పరిధిలో దాదాపు పది వేలకుపైగా ఖాళీ స్థలాలున్నాయి. ఆయా యజమానుల్లో అధిక శాతం మంది ఎక్కడో ఉంటున్నారు. మరికొందరు అందుబాటులో ఉంటున్నా, శుభ్రపర్చుకునే అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు వీటిని శుభ్రం చేసుకోవడంలో విఫలమైతే నోటీసులను శానిటేషన్ అధికారులు జారీ చేస్తారు. అప్పటికీ స్పందించకపోతే కార్పొరేషన్ అధికారులే మెషీన్లు, కార్మికులతో శుభ్రం చేయించి అందుకయ్యే ఖర్చును సదరు స్థలాల యజమానుల నుంచి వసూలు చేసేలా చర్యలు చేపడతారు.

అయితే ఇక్కడ ఇలాంటివేవీ అమలు కావడం లేదు. ఫలితంగా స్థలాల్లో మొక్కలు పెరిగిపోయి చెట్లు, పొదలతో దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు, విషసర్పాల బెడద తీవ్రమవుతోంది. ఇప్పటికైనా శానిటేషన్ విభాగాధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సరస్వతీనగర్‌లో ఇలా..

అధికారులు చర్యలు చేపట్టాలి



ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న చెట్ల కారణంగా సమీప ప్రాంత వాసులు దోమల, విషసర్పాలతో ఆందోళనకు గురవుతున్నారు. స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మల్లికార్జునరెడ్డి, సత్యనారాయణపురం

రోగాల బారినపడే పరిస్థితి



ఖాళీ స్థలాల్లో మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. దీంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఫలితంగా సమీప ప్రాంత ప్రజలు రోగాల బారినపడుతున్నారు. వీటిపై శానిటేషన్ అధికారులు దృష్టి సారించాలి.

– సుబ్బారెడ్డి, శ్రీనివాసనగర్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. దగదర్తికి చెందిన శ్రీనివాసులు (55), భాగ్యమ్మ నగరంలోని సుందరయ్య కాలనీలో గల బంధువుల ఇంటికి ఈ నెల ఆరున వచ్చారు. మరుసటి రోజు రావాలని భార్యకు సూచించి, బైక్‌పై ఇంటికి శ్రీనివాసులు బయల్దేరారు. ఈ తరుణంలో ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్ వేగంగా ఢీకొంది. దీంతో శ్రీనివాసులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైలోని విజయ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడి నుంచి జీజీహెచ్‌కు తీసుకురాగా, చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు నమోదు చేశారు.

బడ్జెట్లో కేటాయింపులపై హర్షం

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి బడ్జెట్లో రూ.162 కోట్లను కేటాయించడంపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు చిన్నబజార్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నేతలు హేమంత్, పెంచలయ్య, సుమన్, శ్రీనివాసులు, సత్యశివ, రామయ్య, కృష్ణ, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నేతాజీనగర్ ఫీడర్‌లో రోడ్డు వెడల్పు పనులను చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్జీటీ కాలనీ, డైకస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

డాక్టర్ గంగాధరానికి సత్కారం

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆయుష్ సీనియర్ ఆఫీసర్ డాక్టర్ గంగాధరాన్ని కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, సిబ్బంది, ఆయుష్ వైద్యశాల సిబ్బంది ఆదివారం సత్కరించారు. ఆక్వా డెవిల్ అసోసియేషన్, విజయవాడ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కృష్ణానది క్రాసింగ్ ఈత పోటీల్లో గంగాధరం పాల్గొని ప్రతిభ చూపడంతో పాటు గణతంత్ర దినోత్సవాన కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. దీంతో ఆయన్ను సన్మానించారు. సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ వెంకటచలపతిగౌడ్, డాక్టర్లు సలావుద్దీన్, మనోజ్ఞ, కౌశిక్, భారతి, రామన్నపాళెం ఆయుష్ మెడికల్ ఆఫీసర్ హేమంత్‌బాబు, సీహెచ్‌సీ హెడ్‌నర్స్ ప్రసూనలత, సిబ్బంది సుమతి, సిందూర, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో గల సబ్‌స్టేషన్ సమీపంలోని విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా మారింది. స్తంభం కిందభాగంలో కొంతభాగం విరిగినా, దీన్ని మార్చే దిశగా ఎవరూ చర్యలు చేపట్టడంలేదు. సిమెంట్ రోడ్డు మధ్యలో ఉన్న దీన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కొంత మేర విరిగింది. ఏ క్షణంలో పడిపోయి ప్రమాదం సంభవిస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





వైఎస్సార్సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని 51వ డివిజన్‌కు చెందిన ప్రకాశం చందు ఆధ్వర్యంలో యువత పెద్ద సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్సీ, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. సందీప్, కాయల వరప్రసాద్, సరిత, ప్రమీలమ్మ, అన్నమ్మ, కరుణ, సుజాత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

నెల్లూరు(బృందావనం): మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణను వివరిస్తూ నగరానికి చెందిన చైతన్య ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్రను మెడికవర్ ఆస్పత్రి సెంటర్ నుంచి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో మొక్కలు నాటారు. జేసీఐ నెల్లూరు, శుభమస్తు షాపింగ్‌మాల్, ఫన్‌పార్క్, హైటెక్ ఫార్మా ప్రోత్సాహంతో యాత్రను చేపట్టానని చెప్పారు. సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, అభిషేక్, సాయి, కిషన్‌రామ్, జగన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మహనీయులకు నివాళులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని గాంధీ, అంబేడ్కర్, వెంకటేశ్వరపురంలోని మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ విగ్రహాలకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఏపీ చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదాన సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏసీనగర్‌లో నివాసం ఉంటున్న అనసూయమ్మ (90) ఆదివారం మృతి చెందారు. చిరంజీవి ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో కుటుంబసభ్యుడు నాగేశ్వరరావు అంగీకారంతో ఆమె నేత్రాలను పెద్దాస్పత్రికి దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 98666 16565 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

భూముల ఆక్రమణకు యత్నంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: జొన్నవాడ ఆలయ భూములను ఆక్రమించేందుకు హంసకుమార్‌రెడ్డి యత్నించారంటూ కామాక్షితాయి ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు.

నాయీ బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ సమావేశం



అధికారులను సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మంపడంలో నాయీ బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని వేలూరు రంగారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలను అందుకున్న నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ వేలూరు రంగారావు, బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ శ్రీహరి, నెల్లూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి సోమవరపు మాల్యాద్రిని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, వల్లూరు బాలకేశవులు, మద్దిపాటి రవి, తాటిపర్తి చెంచుమురళి, సుబ్బారావు, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా.. ఉల్లాసంగా

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏపీ సీనియర్స్ మహిళా హాకీ పోటీలను హాకీ ఎస్పీఎస్సార్, నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వివిధ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌ను సోమవారం నిర్వహించనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





